సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



విద్యార్థుల పాలిట 'నవోదయం'

నవోదయ విద్యాలయంలో 2025-26కు గాను ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. వివరాలు 10లో ▸

ఐడియా ఎల్లలు దాటె..

జీవితం ఘుమఘుమల బాటే..

- 'నెట్టింట' మారుమోగుతున్న తిగుళ్ల లచ్చవ్వ పేరు
- వెరైటీ పిండివంటలకు కేరాఫ్ అడ్రస్
- యూట్యూబ్ చానల్‌లో వీడియోలు చూసి జోరుగా ఆర్డర్లు
- విదేశాలకు సైతం పార్శిళ్లు..

ఆ పిండివంటల ఘుమఘుమలు ఎల్లలు దాటాయి.. 'నెట్టింట' తిగుళ్ల లచ్చవ్వ పేరు మారు మోగుతోంది.. ఇందుకు ప్రధాన కారణం ఒక ఐడియా.. జీవితాన్ని మార్చేసింది. ఇందుకు లచ్చవ్వ జీవితమే ప్రత్యక్ష నిదర్శనం. వెరైటీ పిండివంటలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆమె తయారు చేస్తున్న వంటలు దేశీయులతోపాటు విదేశీయులు కూడా లొట్టలేసుకుంటూ ఆరగించేస్తున్నారు. ఆమె చేసే పిండివంటలు తిని వావ్.. అదుర్స్ అనాల్సిందే. అంతేకాదు.. కస్టమర్ల నుంచి ఆర్డర్లు తీసుకొని డోర్ డెలివరీ సేవలు కూడా అందజేస్తోంది. సరదాగా తన కూతురు యూట్యూబ్‌లో పెట్టిన వీడియోలు తన జీవితాన్నే మార్చేస్తుందని అప్పుడనుకో లేదు. కానీ అనూహ్య మార్పును తీసుకొచ్చింది నమ్మశక్యం కాని నిజం. నేడు ఆమె ఎందరికో ఉపాధికి బాసటగా నిలిచింది.

– చల్లా రాజు, హుస్నాబాద్

10లో ▸



న్యూస్‌రీల్

టాస్క్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ఉద్యోగాలకు 20 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమిక్ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిచారు. హైద రాబాద్‌లోని ఎంఎస్ఎన్ పరిశ్రమ నిర్వాహ కులు జాబ్ మేళ నిర్వహించగా.. పలు కళాశా లలకు చెందిన 35 మంది డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు. కంపెనీ హెచ్ఆర్ఎస్‌లు బాలకృ ష్ణ, శంకర్, కసిరెడ్డి పలు రౌండ్లు ఇంటర్వ్యూలు నిర్వహించగా.. ఇరవై మందిని ఎంపిక చేశారు. ఎంఎస్ఆన్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థు లను ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దారెడ్డి అభినందిం చారు. పరిశ్రమల ప్రతినిధులు, కళాశాల డైరె క్టర్ మారుతిరావు, అమర్‌నాథ్, సంజీవ్‌రావు, శంకర్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై ప్రభుత్వం చిన్న చూపు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై చిన్నచూపు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఔట్ సోర్సింగ్ ఉద్యో గుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోం దని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మయ్య విమర్శించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషిం చలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వాపోయారు. దీనికి తోడు అధికారుల పని ఒత్తిడితో మరింత మానసిక క్షోభను అనుభవి స్తున్నామని పేర్కొన్నారు. కోరి తెచ్చుకున్న ప్రజా పాలన ప్రభుత్వంలో ఇప్పటివరకు ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగుల గురించి పట్టించుకోకవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: డీఎస్సీ 2024 పరీక్షలో మెరిట్ సాధించిన 1:3 ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యు కేషన్ అభ్యర్థులకు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు సంగారెడ్డిలోని డీఈఓ కార్యాల యంలో ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఉం టుందని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ సాధించిన 1:3 అభ్యర్థుల వివరాలు పొందుపరచాల న్నారు. అభ్యర్థులను తమ ఒరిజినల్ సర్టిఫికె ట్లను వారికి కేటాయించిన కౌంటర్లలో వెరిఫై చేయించుకోవాలని పేర్కొన్నారు. ప్రొఫా ర్మాతో పాటు గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన అన్ని సర్టిఫికేట్ల రెండు జతల జిరాక్స్ ప్రతులు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

తపస్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్



తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం ఇస్తున్న తపస్ సంఘం నాయకులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ తదితర బిల్లులు విడుదల చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జహీరాబాద్, మొగుడంపల్లి మండల తహసీ ల్దార్లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సం దర్భంగా జిల్లా అధ్యక్షులు దత్తాత్రి, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు బస్వరాజ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. పది నెలలు గడుస్తున్నా మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీఏ, పీఆర్సీ బిల్లులు విడుదల చేయడం లేదన్నారు. ఉపాధ్యాయులకు రావా ల్సిన ఆర్థిక చెల్లింపులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగు తామని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తపస్ గౌరవ అధ్యక్షులు నరసింహా రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీపాల్, నాయకులు చంద్రశేఖర్, రాజు, మొగులయ్య, మల్లయ్య స్వామి, శివాజీలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మెదక్‌జోన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగా హన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ అన్నారు. సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద ఆదేశానుసారం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఖైదీల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నా రు. వంటశాలను పరిశీలించి చట్టాలపై అవగా హన కల్పించారు.



లంచం తీసుకోం..!

ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగం

ఉద్యోగుల ప్రతిజ్ఞ

సంగారెడ్డి: ట్రాన్స్‌కో కార్యాలయంలోని విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. "మేం లంచం తీసుకోం.. నిస్వార్థంగా విధులు నిర్వరిస్తాం" అని ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో సూపరిం టెండెంట్ ఇంజనీర్ శ్రీనాథ్ మాట్లాడుతూ.. ఎవరైనా సరే లంచం ఇవ్వడం, లంచం తీసుకోవడం నేరమని పేర్కొ న్నారు. ప్రజలు, ఉద్యోగుల్లో చైతన్యం కోసం ప్రతి రోజు ఒక్కో కార్యాలయంలో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ సురేందర్ రెడ్డి, ఏడీలు, ఏఈలు, సీఐ షామల వెంకటేశం ఉన్నారు.

జహీరాబాద్ కాంగ్రెస్‌లో
మూడు ముక్కలాట

చంద్రశేఖర్, గిరిధర్‌రెడ్డిల మధ్య వర్గపోరు

- పరస్పరం అధినాయకత్వానికి ఫిర్యాదులు
- పట్టు కోసం ఎంపీ షెట్కార్ యత్నాలు
- తాజాగా తన కార్యాలయం ఏర్పాటు
- వేరు కుంపట్లు పెట్టుకున్న ముగ్గురు ముఖ్యనేతలు
- అయోమయంలో కాంగ్రెస్ క్యాడర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జహీరాబాద్ నియోజకవ ర్గంలో కాంగ్రెస్ పార్టీ వర్గపోరు ముదురుతోంది. లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన ఈ స్థానంలో ముగ్గురు ముఖ్య నేతలు ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిల మధ్య ఆధి పత్యపోరు కొనసాగుతుండగా, ఎంపీ సురేష్ షెట్కార్ కూడా తన పట్టు నిలుపుకొనే ప్రయ త్నాలు చేస్తున్నారు. దీంతో ఇక్కడి కాంగ్రెస్ క్యాడర్ మూడు వర్గాలుగా విడిపోయింది. ఎవరి వైపు వెళ్లాలో తెలియక పార్టీ కార్యకర్తలు అయోమ యంలో ఉన్నారు.

పీసీసీ వద్ద పంచాయితీ..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి మాజీ మంత్రి చంద్రశేఖర్ పోటీ చేసి ఓటమి పాలైన విషయం విదితమే. తన ఓటమికి గిరిధర్‌రెడ్డినే కార ణమని, ఆయన సహకరించకపోవడంతోనే తాను ఓటమి పాలయ్యానని చంద్రశేఖర్ రగిలిపోతు న్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఇద్దరి మధ్య విభే దాలు పెరిగాయి. వికారాబాద్ జిల్లాకు చెందిన చం ద్రశేఖర్‌ను జహీరాబాద్ నుంచి పోటీ చేయాలని ఆహ్వానించింది తానేనని, ఆయన గెలుపు కోసం శాయశక్తుల కృషి చేశానని గిరిధర్‌రెడ్డి వర్గం వాది స్తోంది. చంద్రశేఖర్ ఓటమికి ఆయన స్వయం కృతా పరాధమే కారణమని తేల్చి చెబుతోంది.

ఇక్కడ కాంగ్రెస్ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు పార్టీకి వెన్నంటి ఉంటూ.. కాంగ్రెస్‌ను కాపాడింది గిరిధర్‌రెడ్డినే అని ఆయన వర్గం గట్టిగా వాదిస్తోంది. మహేశ్‌కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్‌గా బా ధ్యతలు స్వీక రించిన తర్వాత ఉమ్మడి జిల్లాల సమీక్షలో ఈ వివాదం చర్చకొచ్చిన విషయం విదితమే.



ఆగం చంద్రశేఖర్, మాజీ మంత్రి

సురేష్‌షెట్కార్, జహీరాబాద్ ఎంపీ

సెట్విన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డి

'మార్కెట్'పదవితో రాజుకున్న చిచ్చు

జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నేతల మధ్య చిచ్చు రాజేసింది. ఈ పదవిని చంద్రశేఖర్ తన కుమారుడికి ఇప్పించుకున్నాడు. నియోకవ ర్గంలో చాలా ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నాయకులకు ఇవ్వాల్సిన ఈ కీలక పదవిని తన కొడుకుకు ఇప్పించుకోవడంతో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్ర నిరాశతో ఉంది. కనీసం తమతో చర్చించకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారనే గుర్రుగా ఉన్నారు. పార్టీ కోసం పని చేసిన వారిని పక్కనబెట్టి, స్థానికంగా ఉండని తన కుమారుడికి ఈ నామినేటెడ్ పదవి ఎందుకు ఎలా ఇస్తారని గిరిధర్‌రెడ్డి వర్గం వాదిస్తోంది. ఇలా ఇక్కడ పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోయింది.

ఎంపీ కార్యాలయం ప్రారంభంతో..

జహీరాబాద్ కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగు తుండగా, మరోవైపు ఎంపీ సురేష్‌షెట్కార్ తన కార్యాలయాన్ని జహీరాబాద్‌లో ఇటీవల ప్రారంభిం చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఇప్పటికే చంద్రశేఖర్, గిరిధర్‌రెడ్డి కార్యాలయాలు ఉండగా కొత్తగా ఇప్పుడు షెట్కార్ కూడా తన ఎంపీ కార్యాలయాన్ని ఇక్కడ ఓపెన్ చేయడం తో ఒకే నియోజకవర్గంలో మూడు ఆఫీసులు ఏర్పడ్డాయి. పార్టీ కార్యాలయంతో పాటు ఎవరికి వారే కార్యాలయాలు ఓపెన్ చేసుకున్నారు. దీంతో ఇక్కడి కాంగ్రెస్ క్యాడర్ ఏ కార్యా లయానికి వెళ్లాలనేదానిపై అయో మయం నెలకొంది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కూడా తిరగకముందే ఇక్కడ మూడు గ్రూపులుగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ రానున్న రోజుల్లో ఈ వర్గ విభేదాలు ఎటువైపు దారి తీస్తా యనేదానిపై రాజకీయ వర్గాల్లో సర్వత్రా చర్చ జరుగుతోంది.

సంగారెడ్డి ఆర్డీఓగా రవీందర్‌రెడ్డి



సీహెచ్.రవీందర్‌రెడ్డి, ఆర్డీఓ

జహీరాబాద్‌కు పి.రాంరెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి ఆర్డీఓగా సీహెచ్.రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. జహీ రాబాద్ నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచే స్తున్న ఆయన్ను ప్రభుత్వం సంగారెడ్డి ఆర్డీఓగా బాధ్యతలు అప్పగించింది. రవీందర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు సంగారెడ్డి ఆర్డీఓగానే పని చేశారు. ఎన్నికల తర్వాత నిమ్జ్‌కు బదిలీ చేయగా, తాజాగా జరిగిన బదిలీల్లో తిరిగి సంగారెడ్డి ఆర్డీ ఓగా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 మంది అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్త ర్వులు జారీ చేసింది. సంగారెడ్డి ఆర్డీఓగా పనిచేసిన వసంతకుమారిపై ప్రభుత్వం ఇటీవల బదిలీ వేటు వేసిన విదితమే. అప్పటి నుంచి జహీరాబాద్ ఆర్డీ ఓగా పనిచేస్తున్న ఎస్.రాజు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తాజాగా రవీందర్‌రెడ్డిని రెగ్యులర్ ఆర్డీఓగా నియమించారు.

జహీరాబాద్ ఆర్డీఓ రాజు బదిలీ

జహీరాబాద్ ఆర్డీఓ, సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీఓగా పనిచేస్తున్న ఎస్.రాజుకు బదిలీ అయింది. ఆయన్ను మహబూబాబాద్ ఆర్డీఓగా నియమిం చారు. కాగా రాజు స్థానం.. జహీరాబాద్ ఆర్డీఓగా పి.రాంరెడ్డి నియమితులయ్యారు. మహబూబ్‌న గర్ స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న రాంరెడ్డిని జహీరాబాద్‌కు బదిలీ చేశారు.

నిమ్జ్ ఎస్‌డీసీగా బి.శకుంతల

జహీరాబాద్ నిమ్జ్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (యూనిట్ -2)గా బి.శకుంతల నియమితు లయ్యారు. డిప్యూటీ కలెక్టర్ క్యాడర్ అధికారిణి అయిన శకుంతల ప్రస్తుతం పౌరసరఫరాలశాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీఓ

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి ఆర్డీఓ నూతనంగాగా నియమితులైన సీహెచ్.రవీందర్ రెడ్డి కలెక్టర్‌ను కలి శారు. సోమవారం బాధ్యతల స్వీకరించిన ఆయ న.. మర్యాదపూర్వకంగా కలిశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి: తపస్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయుల పెండిం గ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లిం చాలని తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాతు సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం చేగుంట తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అం దజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబం ధించిన నాలుగు డీఏలు, పదవీ విరమణ పొందిన వారికి జీపీఎఫ్, 317 జీఓతో నష్ట పోయిన ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, కృష్ణమూర్తి, సం ఘం బాధ్యులు ప్రభాకర్, సుమతి, యాద గిరి, సిద్ధిరాములు, రాజేశ్వర్‌తో పాటు పలు వురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

- అధికారులకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచన
- 30న తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం పర్యటన



సంగారెడ్డి జోన్: రాష్ట్రంలోని స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజ ర్వేషన్ల దామాషాపై ఆయా రాజ కీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఈ నెల 30 న జిల్లాకు రానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సూచిం చారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాల యంలో బీ.సీ కమిషన్ పర్యటనను పురస్కరిం చుకుని సంబంధిత అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్ స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల దామా షాపై అభిప్రాయాలు సేకరిస్తోందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వారు రాతపూర్వకంగా తమ అభి ప్రాయాలను కమిషన్‌కు నివేదించవచ్చని తెలి పారు. అభిప్రాయాల సేకరణ కోసం విచ్చేస్తున్న బీ.సీ కమిషన్ పర్యటన గురించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని సూచిం చారు. కమిషన్ పర్యటనను పురస్కరించుకుని ఆయా శాఖల వారీగా అధికారులు, సిబ్బందికి కేటా యించిన విధులను తప్పకుండా పాటించాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. అభిప్రాయాలను కమిషన్‌కు నివేదించేందుకు హాజరయ్యే వారికి సహకరించేందుకు వీలుగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం వినతి పత్రాలతో కూడిన పూర్తి వివరాలు, వీడియోలు, ఫొటోలు తదితర వాటిని కమిషన్ కు సమర్పించాల్సి ఉన్నందున అన్నింటినీ జాగ్రత్తగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృ ద్ధి అధికారి జగదీష్, డిఆర్‌ఓ పద్మజరాణి, అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

8 కిలోమీటర్లకు ఒక పీహెచ్‌సీ

- ప్రధాన రహదారుల వెంట ట్రామాకేర్ సెంటర్లు
- మంజీరా బ్యాక్‌వాటర్ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి
- మంత్రి దామోదర రాజనర్సింహ



నారాయణఖేడ్ నీటి పంపింగ్ ట్రయల్‌రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/రేగోడ్(మెదక్): 8 నుంచి 10 కిలో మీటర్ల దూరంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామో దర రాజనర్సింహ అన్నారు. సోమవారం మనూరు మండలంలోని బోరంచ మంజీరా నదిపై రూ. 4 కోట్ల 30 లక్షలతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకం రెండు ఫీల్డ్ గ్రావిటీ మెయిన్స్ పనులకు నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎత్తిపోతల ద్వారా నీటిని వదిలి రేగోడ్ మండలం లోని టి.లింగంపల్లి వద్ద పూజలు చేశారు. ఈసంద ర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడు తూ.. పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందిం చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులకు రాజకీ యాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామ న్నారు. సింగూరు బ్యాక్ వాటర్ ప్రాంతంలో టూరి జంను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకోను న్నట్లు వివరించారు. రూ. 168 కోట్లతో త్వరలో సిం గూరు కాల్వలకు సీసీ లైనింగ్ చేస్తామని వెల్లడిం చారు. రూ. 12 కోట్లతో 30 పడకల ఆస్పత్రిని, వట్ పల్లిలో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ప్రధాన రహదారిపై ఉన్న జోగిపే ట, నిజాంపేటలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జోగిపేటలో రూ. 60 కోట్లతో 150 పడకల ఆస్పత్రిగా విస్తరిస్తామని, రూ. 40 కోట్లతో 60 మంది విద్యార్థులకు సీట్లు లభించేలా నర్సింగ్ కళాశాల, రూ. 16 కోట్లతో మర్పల్లిలో వంతెన నిర్మిస్తామని చెప్పారు. అనం తరం ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడారు. బోరంచ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసినా.. పదేళ్లలో ఒక్క ఎకరాకు సాగుకు నీరు ఇవ్వ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావుపై ధ్వజమెత్తారు. బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలకు రూ. 5 వేల కోట్లు నిధులు విడుదల కాలేకపోయినా జీఓ ఉందని, ఆ నిధులను సద్వినియోగం చేసి రైతు లకు నీరు ఇవ్వాలని మంత్రిని కోరారు.

ఆరు నెలల్లో చెరువులు నింపుతాం

బోరంచ వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి ఆరునెలల్లో చెరువులు నింపి రైతుల భూములు సస్యశ్యామలం చేస్తామని మంత్రి దామోదర తెలిపారు. మొత్తం ప్రాజెక్టులో రూ. 2 కోట్ల 59 లక్షలతో నిర్మించనున్న గ్రావిటీ మెయిన్ ద్వారా రేగోడ్ మండలంలో రేగోడ్, మర్పల్లి, చౌదర్ పల్లి, కోత్వాలపల్లిల్లో చెరువులు నిండి 500 ఎకరా లకు సాగు నీరు అందుతుందని అన్నారు. బోరంచ ఎత్తిపోతల పథకం ద్వారా రేగోడ్, మనూరు మండ లాల్లోని బోరంచ, టి.లింగంపల్లి, తాటిపల్లి, సిం దోల్ గ్రామాల్లో 2,900 ఎకరాలకు సాగు నీరు అం దుతుందని చెప్పారు. మొత్తం 3,400 ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని వివరించారు. కార్య క్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ జలందర్, ఖేడ్, ఆందోల్, నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు. రేగోడ్‌లో డిగ్రీ కళా శాల ఏర్పాటు చేయాలని నేతలు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు.

సీసీఐ కేంద్రాల్లో సౌకర్యాలు తప్పనిసరి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: జిల్లాలోని పత్తి కొనుగోలు కేం ద్రాల్లో రైతులకు అన్ని రకాల వసతులు కల్పిం చాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. వెం టనే పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశం మందిరంలో రెవెన్యూ వ్యవసాయ ,మార్కెటింగ్ శాఖల అధికారులతో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో 3.51 లక్షల ఎకరాలలో పత్తి పం ట సాగైందన్నారు. పండించిన పత్తి పంటను ఏఈఓలు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయా లన్నారు. ఎంపిక చేసిన అన్ని జిన్నింగ్ మిల్లులలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ సెంటర్ లో నెట్ సదుపా యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచిం చారు. జిమ్మింగ్ మిల్లుల వద్ద లారీల పార్కింగ్ ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పత్తి లారీలు త్వరగా ఖాళీ చేసి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కి త్వరిత గతిన తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధికారులు జిన్నింగ్ మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీ లు చేయాలనీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, అధికారులుపాల్గొన్నారు.

ప్రజావాణిపై దృష్టి సారించండి

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో భాగంగా వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకో వాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 66 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిం చాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ పద్మజరాణి, వివిధ శాఖల అధికా రులు పాల్గొన్నారు.

టపాకాయల దుకాణాలకు.. అనుమతి తప్పనిసరి



ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి జోన్: దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసే టపాకాయల దుకాణాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఈ విషయమై సంబంధిత సబ్-డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఎవరైనా ముందస్తు అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసినట్లయితే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్టు 1884 ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

ఇవీ నియమ, నిబంధనలు

- టపాకాయల దుకాణాలను నెలకొల్పే వారు సం బంధిత పోలీసుల అనుమతి పొంది ఉండాలి.
- దుకాణాలు ఖాళీ ప్రదేశాలలో జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన స్థల యజమాని నుంచి ఎన్‌ఓసీ సర్టిఫికెట్ పొంది ఉండాలి.
- దుకాణాల మధ్య వ్యత్యాసం మూడు మీటర్లు, రెసిడెన్షియల్, గృహనిర్మాణాలకు 50 మీటర్ల దూరంలో ఉండాలి.
- జనాలు రద్దీగా ఉండే ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల షాపులు ఏర్పాటు చేయరాదు.
- అగ్నిప్రమాదాలకు సంబంధించి తక్షణం స్పందిం చే విధంగా సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉం డేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

క్లుప్తంగా

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు శరీరానికి నిప్పంటుకొని గాయాలైన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని వల్లంపట్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తంగనపల్లి కృష్ణమూర్తి (63) తపాలా శాఖలో పని చేస్తున్నాడు. దీంతో పాటు పెయింటింగ్ పని కూడా చేస్తుంటాడు. ఈనెల 23న పెయింటింగ్ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చాడు. చేతులకు పెయింటింగ్ అంటుకోవడంతో టర్పెంటైన్ ఆయిల్ చేతులపై వేసుకుని రాసుకున్నాడు. బీడీ తాగే అలవాటు ఉండడంతో ఈ సమయంలో అగ్గిపుల్లతో అంటించే క్రమంలో చేతులతోపాటు శరీరం అంతా నిప్పంటుకుంది. కృష్ణమూర్తిని కాపాడేందుకు కుటుంబ సభ్యులు స్థానికులు దుప్పట్ల వేసి మంటలను ఆర్పేందుకు ప్రత్నించారు. అప్పటికే తీవ్రంగా గాయాలైన అతడిని చికిత్స నిమిత్తంగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా ఇక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహబుబ్ తెలిపారు. కృష్ణమూర్తికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కూరెళ్లలో గుప్త నిధుల తవ్వకాలు


గుప్తనిధుల కోసం తవ్విన భారీ గుంత

కోహెడరూరల్(హుస్నాబాద్): గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు జోరుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని కూరెళ్లలో ఆందోళన నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మదాద గుట్ట సమీపంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలాల వద్ద గుప్త నిధులు ఉన్నట్లు కొన్ని రోజులగా ప్రచారం జరుగుతుంది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు వాటి కోసం ఆదివారం రాత్రి గడ్డపారతో భారీ గుంతలు తవ్వారు. ఈ ప్రాంతంలో కొబ్బరికాయ, నిమ్మకాయలు ఉన్నాయి. అయితే ఎవరు ఎందుకు తవ్వారో? ఏం చేశారో? అని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

వైద్యుడి నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతి

బాధిత కుటుంబసభ్యుల ఆందోళన

పోలీసుల హామీతో విరమణ


యాదగిరి (ఫైల్)

చేగుంట (తూప్రాన్): వైద్యుడు నిర్లక్ష్యంతోనే వ్యక్తి మృతిచెందాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తూ సోమవారం మండల కేంద్రమైన చేగుంటలో నిరసనకు దిగారు. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతసాగర్‌కు చెందిన చందా యాదగిరి (52) మూత్ర సంబంధిత సమస్యతో బాధపడుతూ చేగుంటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకున్నారు. రిపోర్టులు రాగా వాటిని పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ అవరమవుతుందని చెప్పారు. ఆపరేషన్‌కు టేబుల్ మీద మత్తుమందు ఇస్తున్న క్రమంలో యాదగిరి శరీరం చల్లబడింది. వెంటనే అంబులెన్స్‌లో అతడిని మెదక్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇతను మృతిచెందాడని చేగుంటలోని ప్రైవేటు ఆస్పత్రి వద్ద మృతుడి బంధువులు నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించి వారు ఆందోళనను విరమించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఐడియా ఎల్లలు దాటె..

తెలంగాణ లచ్చవ్వ పిండివంటలకు దక్కిన పాపులారిటీ


అప్పాలను ముకుడులో కాలుస్తున్న మహిళలు

సరదాగా వంటలు చేసిన వీడియోలు నెట్టింట పోస్ట్ చేస్తే ఇదే ఉపాధికి ఊతమైంది. ఇవి వైరల్ గా మారి రోజురోజుకూ చూసేవారి సంఖ్య పెరుగుతోంది. వాటిని వీక్షించిన వారు తమకిష్టమైన పచ్చళ్లు, పిండివంటలు తయారు చేసి ఇవ్వాలని మెసేజ్‌లు మీద మెసేజ్‌లు పెడ్తున్నారు. దీంతో ఇదేదో బాగుందని గ్రహించారు. అప్పటి నుంచి తెలంగాణ లచ్చవ్వ పిండి వంటలు అనే పేరిట యూట్యూబ్ చానల్ నడుపుతున్నారు. అందులో తయారు చేసిన పిండివంటల వీడియోలు పెడుతున్నారు హుస్నాబాద్‌కు చెందిన తిగుళ్ల లచ్చవ్వ. తాను జీవనోపాధి పొందడమే కాకుండా మరికొంత మందికి ఉపాధిని కల్పిస్తోంది.

-హుస్నాబాద్


గరిజెలు చేస్తున్న మహిళలు

గుడిసెలో కట్టెల పొయ్యిపైనా

లచ్చవ్వకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంటిలో ఉంటుంది. ఆ ఇంటి పక్కనే ఖాళీ స్థలంలో ఓ గుడిసె వేసి పిండి వంటల తయారు చేయడం మూడు నెలల క్రితం మొదలు పెట్టారు. వివిధ శుభకార్యాలకు, పెళ్లిళ్లకు ఆర్డర్ల పైన పిండి వంటలు సప్లయ్ చేస్తున్నారు. గారెలు, సకినాలు, అరిసెలు, పూసలు, గరిజెలు, లడ్డూ, మడుగులు ఇలా పలు రకాలుగా తయారు చేస్తూ ఆర్డర్‌లు తీసుకొని డోర్ డెలివరీ చేస్తున్నారు. పిండివంటలు రుచికరంగా ఉండాలని కట్టెల పొయ్యినే వాడుతున్నారు. పిండిని కలవడం, అల్లం, ఎల్లిపాయలు దంచడం మొదలు కొని ప్రతీ పనిని చేతులతోనే చేస్తున్నారు. వాటితో లచ్చవ్వ ఉపాధి పొందడమే కాకుండా దాదాపు 10 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. పండుగల సమయంలో ఆర్డర్లను బట్టి దాదాపు 20 మంది మహిళలు ఉపాధి పొందుతారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తే ఒక్కో మహిళకు రూ.300లు ఇస్తున్నారు. వివిధ రకాల పచ్చళ్లను తయారు చూస్తూ సప్లయ్ చేస్తున్నారు. ఆర్డర్‌పై మామిడి, నిమ్మకాయ, టమాట, ఉసిరి పచ్చళ్లే కాకుండా చికెన్, చేపలు, రొయ్యల పచ్చళ్లు కూడా తయారు చేస్తున్నారు. పిండి వంటలు కిలోకు రూ.400లు. స్వీట్లు కిలోకు రూ.500లు, చికెన్ పచ్చడి కిలోకు రూ.1,200లు తీసుకొని పార్సిల్ చేసి పంపుతున్నారు.


సిద్ధం చేసిన అప్పాలు, సకినాలు, మడుగులు

భలే క్రేజ్

తెలంగాణ లచ్చవ్వ పిండి వంటలకు భలే క్రేజ్ పెరిగింది. ఎవరికి ఇష్టమైన పిండివంటలు తయారు చేసి ఇవ్వాలని లచ్చవ్వ ఫోన్‌కు వివిధ రాష్ట్రాల నుంచి మెసేజ్‌లు పంపుతున్నారు. ముంబయి, ఢిల్లీ, బెంగళూర్, తిరుపతి, హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. విదేశాల్లో ఉన్న వారు కూడా లచ్చవ్వ పిండి వంటలకు ఫిదా అయి తమ బంధువుల ద్వారా పిండి వంటలను తీసుకెళ్తున్నారు. పిండి వంటలను ప్రత్యేకంగా అట్టపెట్టెల్లో ప్యాక్ చేసి ఆర్టీసీ కార్గో ద్వారా సప్లయ్ చేస్తున్నారు. వేరే రాష్ట్రాలకు డీటీటీసీ ద్వారా పంపుతున్నారు.

యూట్యూబ్‌లో చక్కర్లు....

తెలంగాణ లచ్చవ్వ.. తయారు చేసిన వంటలు, పచ్చళ్ల వీడియోలు యూట్యూబ్‌లో చక్కర్లు కొడుతున్నాయి. రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. రెండు నెలల కాలంలోనే పిండి వంటలకు యూట్యూబ్‌లో 4.59 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ చేసుకుని ఫిదా అవుతున్నారు. ప్రతీ నెల ఆమె అకౌంట్‌లో రూ.20వేలు జమ అవుతున్నాయంటే కష్టమర్స్.. పిండివంటలు ఎంత ఇష్టపడుతున్నారో తెలుస్తోంది.



రోజూ పని ఉంటుంది



పిండి వంటలు చేయడం కాల్చడం వంటి పనులు చేస్తాం. ఉదయం వచ్చి సాయంత్రం వరకు పిండి వంటలు చేస్తాం. రోజుకు రూ.300 ఇస్తున్నారు. ఎండలో, వానలో పనికి పోయేకంటే ఇంటి సమీపంలోనే ఒక్క దగ్గర కూర్చొని పని చేయడం సులువుగా ఉంది. మేము సెలవు అంటే తప్ప రోజూ పని ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు వస్తున్నాయి. ఇంట్లో ఎలా చేసుకుంటామో అంత కంటే రుచికరంగా పిండి వంటలు తయారు చేస్తున్నాం.

కొలుకూరి సరిత, హుస్నాబాద్

ఆర్డర్ పై సప్లయ్ చేస్తున్నాం



మూడు నెలల నుంచి ఆర్డర్ల పై పిండి వంటలు తయారు చేయడం మొదలు పెట్టాం. నా కూతురు నేను చేసిన పిండి వంటల తయారీ వీడియోలను సరదాగా యూట్యూబ్‌లో పెట్టింది. నా వంటలు చేసే పద్ధతి నచ్చి వివిధ రాష్ట్రాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. నేను పంపిన పిండి వంటల రుచి చూసి బాగున్నాయని మెసేజ్ పెడుతున్నారు. పచ్చళ్లు కూడా ఆర్డర్‌పై పంపిస్తున్నా. ఒకరికొకరు చెప్పుకుంటూ ఇలా ఎంతో మంది రకరకాల పిండి వంటలు కావాలని కోరుతున్నారు. వారికిష్టమైన పదార్థాలను తయారు చేస్తున్నాం. మేమే కాకుండా కొంత మంది ఉపాధి పొందుతున్నారు.

తిగుళ్ల లచ్చవ్వ, హుస్నాబాద్

అత్యాచార యత్నం కేసులో 20 ఏళ్ల జైలు

ఎస్పీ రూపేశ్

హత్నూర(సంగారెడ్డి): మైనర్‌పై అత్యాచార యత్నం కేసులో ఓ వ్యక్తికి 20 ఏళ్ల కఠినశిక్షతోపాటు 20 వేల జరిమానాను సంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ రూపేశ్ తెలిపారు. 2017లో సెక్షన్ 376, 511 ఐపీసీ, సెక్షన్ 8 పోక్సో కింద హత్నూర పోలీసు ఫిర్యాదు రాగా అప్పట్లో కేసు నమోదైంది. హత్నూర మండలం దౌల్తాబాద్‌లో పిల్లముల దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి తన పక్కింటిలో ఉన్న బాలికపై అత్యాచార యత్నం చేయడానికి ప్రయత్నించాడని పోలీసులకు మైనర్ తల్లి ఫిర్యాదు చేసింది. నాటి ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు పూర్తి చేయగా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ చార్జ్ షీట్ దాఖలు చేశారు. సోమవారం కేసు విచారణ రాగా సెషన్స్ పోక్సో జడ్జి కె. జయంతి.. పైతీర్పు ఇచ్చారని ఎస్పీ రూపేశ్ పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు, జరిమానా

పటాన్‌చెరు టౌన్: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు, జరిమానా విధించిన సంఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం... బీరంగూడ లింగమయ్య కాలనీకి చెందిన బాలికను జులై 11వ తేదీ 2019 లో ఇంటికి ఎదురుగా నివాసం ఉండే కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం ఖత్గావ్‌కు చెందిన కొట్టంవారి బస్వరాజ్ (లింగమయ్య కాలనీ) తన స్కూటీపై బాలికను ఎక్కించుకొని టైలర్ కాలనీలో ఉన్న తన గోదాం వద్దకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక కుటుంబ సభ్యులు అమీన్‌పూర్ స్టేషన్‌లో బస్వరాజ్‌పై ఫిర్యాదు చేయగా అప్పట్లో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ తరలించారు. సోమవారం కేసు పూర్వాపరాలను పరిశీలించి సెషన్స్ పోక్సో న్యాయమూర్తి కె. జయంతి నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష , 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

డీసీఎం క్లీనర్ మృతి


అబ్దుల్ ముబిన్

తూప్రాన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని డీసీఎం క్లీనర్ మృతిచెందారు. ఈ సంఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిసిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన అబ్దుల్ ముబిన్ (25) కొంతకాలంగా డీసీఎం క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రోజున డీసీఎం యాజమాని నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు డీసీఎం తీసుకురావాలని తెలపడంతో ఆరోజు సాయంత్రం డీసీఎం తీసుకొని నగరానికి బయలుదేరాడు. మార్గమధ్యలో తూప్రాన్ దాబాల వద్ద తెల్లవారుజాము రహదారి పక్కన డీసీఎం నిలిపి రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

జహీరాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో పేకాట జూదం ఆడుతున్న కేంద్రాలపై దాడులు చేసి 25 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. సోమవారం బడంపేట తదితర గ్రామాల్లో దాడులు చేసి ఈ సందర్భంగా రూ.6 వేలు నగదు, 7 సెల్‌ఫోన్లు, నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి..

కొమురవెల్లి(సిద్దిపేట): తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన సంఘటన మండలంలోని అయినాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామానికి చెందిన బుడిగే కిష్టయ్య (63) కల్లు గీసేందుకు తాడి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు నడుముకు ఉన్న మోకు జారిపోవడంతో కింద పడి మృతిచెందాడు.

ప్రేమ వ్యవహారంపై ఇంట్లో ఏమంటారోనని..

యువకుడి ఆత్మహత్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రేమ వ్యవహారంలో మనస్తాపం చెంది ఓ యువకుడు కుమ్మరికుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలపరిధిలోని మలపాడ్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నమనగోని రంజిత్(19) పుల్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. తోటి క్లాస్‌మేట్ బర్త్ డేకు రమ్మని పిలవడంతో తెల్లవారుజామున 2 గంటలకు పుల్కల్‌లో నివాసముంటున్న యువతి ఇంటికి వెళ్లాడు. వారి ప్రేమ వ్యవహారాన్ని యువతి తల్లిదండ్రులు గమనించి మందలిస్తే స్నేహితులతో కలిసి తిరిగొచ్చాడు. తన విషయం ఇంట్లో తెలిస్తే ఏమంటారోనని మనస్తాపం చెంది గ్రామ శివారులోని కుమ్మరికుంట గట్టుపై తన సెల్ ఫోన్, వాహనం పెట్టి కుమ్మరికుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జహీరాబాద్: మండల కేంద్రమైన కోహీర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం నమ్మదగిన సమాచారం మేరకు ఓ ఇంటిని తనిఖీ చేసి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కోహీర్ పోలీసులు అఫ్రోజ్, మజర్, ఫిరోజ్, పెంటయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సదాశివపేట బైపాస్‌లో రెండు లారీలు ఢీ

- లారీ క్లీనర్, కూలీ దుర్మరణం
- మృతులు ఘట్‌కేసర్ వాసులు
- నిద్రమత్తే ప్రమాదానికి కారణం?

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లారీ క్లీనర్, కూలీ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులు ఘట్‌కేసర్‌కు చెందినవారు. పోలీసుల కథనం ప్రకారం.. షామిర్‌పేట నుంచి ఇటుక లోడుతో పాటు ఘట్‌కేసర్ అన్నాజీగూడకు చెందిన కూలీలు విజయ్‌కాంప్లే, వినోద్, ఈశ్వరదేవ, సూరజ్, పరమేశ్వర్, దీపక్‌లను ఎక్కించుకుని జహీరాబాద్ వెళ్తున్న లారీ సదాశివపేట పట్టణ.. బైపాస్‌రోడ్డు నిజాంపూర్ కూడలికి సమీపంలోకి రాగానే టైర్ పంక్చరైంది. డ్రైవర్ కేతావత్ రాజశేఖర్ వాహనాన్ని రోడ్డు పక్కన పార్క్ చేశాడు. వెనుక టైర్ల వద్ద జాకీ ఎక్కిస్తుండగా క్లీనర్ గైక్వాడ్ దీపక్, కూలీ పరమేశ్వర్ సహాయం చేస్తున్నారు. ఇంతలో హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ఆగి ఉన్న లారీని ఢీట్టాడు. ఈ ప్రమాదంలో గైక్వాడ్ దీపక్ (58), కూలి పరమేశ్వర్(37) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. డ్రైవర్ కేతావత్ రాజశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కంటైనర్ క్యాబిన్ నుజ్జునుజ్జుకావడంతో డ్రైవర్ యోగేశ్ ఇరుక్కుపోయాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని అరగంట శ్రమించి అతికష్టం మీద అతడిని బయటకు తీశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంటైనర్ డ్రైవర్ యోగేశ్, కేతావత్ రాజశేఖర్, దేవీసింగ్‌లను 108 వాహనంలో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కంటైనర్ లారీ డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. లారీ డ్రైవర్ కేతావత్ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ.మహేశ్‌గౌడ్ తెలిపారు.

వివాహితపై ఆటోడ్రైవర్ అత్యాచారం

జగదేవ్‌పూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి

జగదేవ్‌పూర్(గజ్వేల్): వివాహితపై ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన మహిళ బతుదెరువు కోసం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది. ఆదివారం వ్యక్తిగత పనితో పాటు పెన్షన్ కోసం స్వగ్రామమైన సాల్వాపూర్‌కు హైదరాబాద్ నుంచి బస్సులో ఎక్కి జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి స్టేజీ వద్ద దిగింది. వట్టిపల్లి నుంచి కాలినడకన గ్రామంలోకి నడుచుకుంటూ వెళ్తుండగా వట్టిపల్లి గ్రామ శివారులో వెనుక నుంచి వస్తున్న ఇదే గ్రామానికి చెందిన యువకుడు కిసారి నర్సింహులు ఆటో నడుపుకుంటూ వచ్చారు. ఆమెను అందులో ఎక్కించుకుని పక్కనున్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకునిపోయి అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు గ్రామంలోని పెద్దల దృష్టికి తీసుకు పోగా సోమవారం జగదేవ్‌పూర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

ప్రార్థనా మందిరం పరిశీలన


సార్లవాడలో దాడి జరిగిన ప్రాంత మందిరాన్ని పరిశీలిస్తున్న డీసీపీ మల్లారెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ.. సార్లవాడలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ వర్గానికి చెందిన ప్రార్థనా మందిరంపై దాడి, పాక్షిక ధ్వంసం చేసిన ఘటనలో ఈ ప్రాంతాన్ని సోమవారం డీసీపీ మల్లారెడ్డి పరిశీలించారు. మందిర నిర్మాణ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి చుట్టుపక్కల నివాసముంటున్న వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సర్వే నంబరు 131 ప్రభుత్వ భూమా? పట్టా భూమా? అన్న విషయంతో పాటు నిర్మాణ స్థల భూమి ఎవరి పేరిట ఎలా అసైన్డ్ అయ్యిందనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రార్థనా మందిరం నిర్మాణం చేస్తున్న వ్యక్తి వద్ద ఏ ఆధారాలున్నాయి, పంచాయతీ అనుమతి ఉందా లేదా అనే విషయంపై ఆరా తీశారు. మందిరంపై దాడి జరిగినప్పుడు.. ఇప్పుడు నెలకొన్న పరిస్థితుల గురించి తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయకూడదన్నారు. ఒకవేళ ఇస్తే మతపరమైన అల్లర్లు జరిగే అవకాశాలుంటాయన్నారు. ఘటన స్థలం వద్ద ఎలాంటి అల్లర్లు జరగకుండా ఆదివారం రాత్రి నుంచి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు రిమాండ్

ఈ ఘటనలో ఏడుగురు వ్యక్తులను సోమవారం కుకునూరుపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో తిమ్మారెడ్డిపల్లితో పాటు దమ్మక్కపల్లి, బందారం గ్రామాలకు చెందిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థులకు నవోదయం

- ఈ విద్యాలయంలో 9, 11వ తరగతి అడ్మిషన్‌లు
- ఫిబ్రవరి 8న ఎంట్రెన్స్ పరీక్ష
- ఈనెల 30 వరకు దరఖాస్తుల స్వీకరణ



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరం 9,11వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఫిబ్రవరి 8న ఎంపిక పరీక్ష ఉంటుందని, ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఇందుకోసం ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌ఏడీఎంఐఎస్ఎస్ఐవోఎన్‌సీఎల్ఏఎస్ఎస్‌ఐఎక్స్ (నవోదయ. గవ్.ఇన్) వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత, పరీక్ష సిలబస్ తదితర విషయాలను తెలిపారు.

అర్హతలు : ఉమ్మడి మెదక్ జిల్లాకు చెంది ఉండాలి. వారి తల్లిదండ్రులు ఇక్కడే నివాసమై ఉండాలి. 9వ తరగతిలో ప్రవేశం కోసం అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం (2024–25)లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఉండాలి. అభ్యర్థి మే 1, 2010 –జూలై 31, 2012 మధ్య జన్మించి ఉండాలి. 11వ తరగతిలో ప్రవేశం కోసం అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం (2024–25)లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలి. జూన్ 1, 2008 – జూలై 31, 2010 మధ్య జన్మించి ఉండాలి.


డీ రాజేందర్, ప్రిన్సిపాల్

9వ తరగతి కోసం ఎంపిక పరీక్ష సిలబస్ : హిందీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్‌కు చెందిన ప్రశ్నలు ఉంటాయి. ఓఎంఆర్ ఆధారిత ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నాపత్రం ఉంటుంది.

11వ తరగతి కోసం ఎంపిక పరీక్ష సిలబస్: మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్‌కు చెందిన ప్రశ్నలుంటాయి. ఓఎంఆర్ ఆధారిత ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నాపత్రం ఉంటుంది. వివరాలను నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్‌లో చూడొచ్చు.